ప్రతిపక్షం

www.prathipaksham.in

బుధవారం 05.11.2025

Published From Hyderabad

@prathipaksham

prathipaksham tv telugu

అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ప్రతిపక్షం, సిటి బ్యూరో

నవంబర్ 4: జూబ్లీహిల్స్ అభివృద్ధి ప్రజల సంక్షేమం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వారానే సాధ్యమవుతుందని మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమాజిగూడ డివిజన్‌లో రాష్ట్ర మంత్రులు దుద్దిల్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మైనంపల్లి హనుమంతరావు తదితరులు కలసి శ్రీనగర్ పార్క్, డి-పార్క్‌లో పరిసరాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్కుల్లో వ్యాయామం చేస్తున్న ప్రజలను, వాకర్స్ అసోసియేషన్ సభ్యులను, కాలనీ వాసులను కలుసుకుని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంత్రులు కోరారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రోడ్లు, పార్కులు, డ్రైనేజీ, పబ్లిక్ లైటింగ్ వంటి మౌలిక వసతుల అభివృద్ధిని వేగవంతం చేస్తామని తెలిపారు. కాలనీల్లో పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ జోన్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించేల చర్యలు తీసుకుంటామని అన్నారు. సీనియర్ సిటిజన్ల కోసం హెల్త్ చెక్‌అప్ సెంటర్లు, వాకింగ్ ట్రాక్ మెరుగుదల వంటి సదుపాయాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. యువత ఆరోగ్యవంతమైన జీవన శైలి కోసం స్పోర్ట్స్ గ్రౌండ్లు, ఫిట్‌నెస్ సెంటర్ల ఏర్పాటు కు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మహిళల భద్రతకు సీసీ కెమెరాలు, వీధి దీపాల విస్తరణ, పోలీస్ బీట్ వ్యవస్థ బలోపేతం. మైనార్టీ, బీసీ, ఎస్సీ వర్గాలకు విద్య, ఉపాధి అవకాశాల కల్పించేలా కృషి చేస్తామని మంత్రులు స్పష్టం చేశారు. "జూబ్లీహిల్స్ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వారానే సాధ్యమవుతుంది. నవీన్ యాదవ్ విజయం కీలకమైన మలుపు అవుతుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ నాయకులు, కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నేతలు తదితరులు పాల్గొన్నారు.